పొగ మంచు ప్రమాదంలో ముంచు

- వాహనదారులు జాగ్రత్తగా ఉండాలి
- విజ్ఞప్తి చేసిన ఎస్పీ వినీత్ గంగన్న

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 26: చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పొగ మంచులో ప్రయాణం చేసేటప్పుడు వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న కోరారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదంలో చిక్కుకుంటారని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

సూచనలు ఇవీ..

తెల్లవారుజామున పొగ మంచు కారణంగా ముందున్న రోడ్డు కనిపించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దృశ్యమానత తక్కువగా ఉన్నప్పుడు పొగమంచులో డ్రైవింగ్ చేయడం కష్టంగా ఉంటుంది. దీని నివారణకు.. వాహనాల హెడ్ లైట్లను తక్కువ బీంపై సెట్ చేసుకోవాలి. హై బీంపై హెడ్‌లైట్ వినియోగిస్తే.. ఆ కాంతి మంచుపై పడి ప్రతిబింబిస్తుంది. ఈ కారణంగా రోడ్డు ప్రమాదం జరిగే పరిస్థితి ఉంటుంది. విజిబులిటీ 100 మీటర్లకంటే తక్కువగా ఉంటే.. ఫాగ్ ల్యాంపులను ఆన్ చేయడం మంచిది. పొగ మంచు తీవ్రంగా ఉన్నప్పుడు వాహన వేగాన్ని బాగా తగ్గించాలి. రోడ్డుపై ట్రాఫిక్ కనిపించకపోతే.. వినికిడి (టైర్లు, వాహనాల హారన్ శబ్దాలు) ద్వారా.. ముందు/వెనుక వాహనాలు ఉన్న దూరాన్ని, ట్రాఫిక్ పరిస్థితిని అంచనా వేసేందుకు ప్రయత్నించాలి. తదనుగుణంగా వాహన వేగం తగ్గించడం, నిలిపివేయడం వంటివి చేయాలి. పొగ మంచులో డ్రైవింగ్ చేసేటప్పుడు పాటలు (మ్యూజిక్) వినడం మంచిది కాదు. రోడ్డుపై నిర్దేశిత క్రమంలోనే వాహనాన్ని డ్రైవ్ చేయాలి. పొగమంచు తీవ్రత ఉన్నప్పుడు పార్కింగ్ లైట్/ఇండికేటర్ల ద్వారా ముందు, వెనక వచ్చే వాహనాలకు సిగ్నల్స్ ఇవ్వాలి. వాహనదారులు కనీస దూరం పాటించాలి. ట్రాఫిక్ సమస్య ఉన్నప్పుడు దృష్టి కేంద్రీకరించి వాహనాన్ని నడపాలి.

రాష్ట్రస్థాయి అండర్-17
బాలికల క్రికెట్ పోటీల విజేత 'రంగారెడ్డి

విక్టరీ సింబల్ చూపుతున్న రంగారెడ్డి జట్టు

అశ్వాపురం, డిసెంబర్ 26 : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గౌతమ్‌నగర్ కాలనీ హోమీ బాబా క్రికెట్ స్టేడియంలో నాలుగురోజులుగా నిర్వహిస్తున్న అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో మంగళవారం రంగారెడ్డి జట్టు విజేతగా నిలిచింది. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జట్లు ఫైనల్‌లో తలపడగా టాస్ గెలిచి మొదటి బ్యాటింగ్ చేసిన రంగారెడ్డి జట్టు నిర్ణీత 12 ఓవర్లకు 109 పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు కేవలం 49 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి పాలైంది. కార్యక్రమంలో పీఎం డీజీఎం ఘంటసాల శ్రీనివాస్, ఎంఈవో వీరాస్వామి, భారజల కర్మాగార పురప్రముఖులు, ఎస్జీఎఫ్ సెక్రటరీ స్టెల్లా ప్రేమ్‌కుమార్, సెక్రటరీ అనిల్‌కుమార్, వీరన్న, ఆదినారాయణ పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ విస్తరించాలని మంత్రికి వినతి

మంత్రి తుమ్మలను కలిసిన కాంగ్రెస్ నాయకులు

అశ్వారావుపేట, డిసెంబర్ 26: అశ్వారావుపేటలో నిర్మిస్తున్న సెంట్రల్ లైటింగ్‌ను మరింత దూరం విస్తరించాలని కోరుతూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు డీసీసీబీ డైరెక్టర్ నిర్మల పుల్లారావు మంగళవారం ఖమ్మంలో వినతిపత్రం ఇచ్చారు. దీనిపై మంత్రిసానుకూలంగా స్పందించారు. నారాయణపురం సర్పంచ్ కంగాల పరమేష్, నాయకులు చందు వేణుగోపాల్, కోట మంగరాజు పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 26: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇల్లెందు ఏరియా రిటర్నింగ్ ఆఫీసర్ సంతోష్ మహుర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లెందు ఏరియాలోని 614 మంది ఓటర్లకు మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

పాల్వంచ రూరల్, డిసెంబర్ 26: మండంలోని నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్ కోర్సులో నెల రోజులపాటు ఉచితంగా ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ చందులాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కనీసంగా పదోతరగతి చదివిన వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 9866 445 473 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

చర్చిలో అన్నదానం

అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 26: ఇల్లెందు కోర్టు ఏరియాలోగల సీఎస్ఐ చర్చిలో నిర్వాహకులు మంగళవారం అన్నదానం నిర్వహించారు. దీనిని ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. చర్చి చైర్మన్ రెవ.ఫ్రాంక్లిన్, పాదర్ సుధాకర్ పాల్గొన్నారు.

చలికాలంలో జాగ్రత్తగా ఉండాలి

వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యురాలు

పర్ణశాల, డిసెంబర్ 26: ఏజెన్సీ ప్రాంతంలో చలికాలం కావడంతో చలి ఎక్కువగా ఉంటుందని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రేణుకారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మాట్లాడుతూ గొంతునొప్పి, జ్వరం, ఒళ్లు నొప్పులు లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వైద్యులను సంప్రదించాలని అన్నారు. అదే విధంగా పదేళ్లలోపు పిల్లలు, వృద్ధులు బయటకు రాకుండా ఇంటి వద్దనే ఉంటే మంచిదన్నారు. ఆయాసం ఉన్న వారు చలికాలంలో బయట బయట ప్రదేశంలో తిరగకుండా ఉండాలని సూచించారు. వైద్యాధికారులు, సిబ్బంది సూచనలు పాటించాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-314383-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

మాట్లాడుతున్న డాక్టర్ తాళ్లూరి రాజా శ్రీకృష్ణ

భద్రాచలం, డిసెంబర్ 26 : క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తి ముఖ్యమని ఎన్నారై డాక్టర్ తాళ్లూరి రాజా శ్రీకృష్ణ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో 28వ నెహ్రూ కప్ తాళ్లూరి భారతీదేవి స్మారక రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ దాదాపు 28 ఏళ్లుగా ఏజన్సీ ప్రాంతంలో నెహ్రూ కప్ క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నెహ్రూ కప్ నిర్వాహకులు వాతాడి దుర్గా అశోక్, బాల యోగి, మిత్ర బృందాన్ని ప్రశంసించారు. పాల్ రాజ్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ వరలక్ష్మి సాయిరాం మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో క్రీడలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు చెంగల్‌రావు, వల్లూరుపల్లి వంశీ, యోగి సూర్యనారాయణ, ఎస్కే అజీమ్, కుంచాల రాజారాం, ఉడత రమేశ్, వేముల కామేశ్వరరావు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వాహన యజమాని ఇంటి ఎదుట బంధువుల ఆందోళన

ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

చర్ల, డిసెంబర్ 26: బొలేరో వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి ఓ వ్యక్తి మృతిచెందగాగా వాహన యజమాని ఇంటి ఎదుట మృతుడి బంధువుల ఆందోళన చేపట్టిన ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపురం మండలం బోదాపురం సమీపంలో జాగింగ్‌కు వెళుతున్న సోడి శ్రీనివాసరావు (55)ను చర్ల నుంచి వెంకటాపురం వెళుతున్న బొలేరో వాహనం సోమవారం ఉదయం ఢీకొట్టింది. శ్రీనివాసరావుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం బంధువులు అతడిని భద్రాచలం తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ అతడు మృతిచెందాడు. అయితే, శ్రీనివాసరావును ఢీకొన్న బొలేరో చర్లకు చెందిన వ్యక్తిది కావడంతో మృతుడి బంధువులు మంగళవారం శ్రీనివాసరావు మృతదేహాన్ని చర్లకు తీసుకువచ్చి బొలేరో యజమాని ఇంటి ఎదుట ఉంచి ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న చర్ల సీఐ రాజగోపాల్ అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బొలేరో డ్రైవరును వెంకటాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారని అన్నారు. తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా, మృతుడు సోడి శ్రీనివాసరావు భద్రాచలం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్నట్టు తెలిసింది.

ఈ-కేవైసీ నిరంతర ప్రక్రియ

సారపాక, డిసెంబర్ 26 : బూర్గంపహాడ్ మండలంలోని గ్యాస్ వినియోగదారులు హెచ్‌పీ గ్యాస్ ఈ-కేవైసీ చేయించుకునే విషయంలో ఆందోళన చెందవద్దని, ఇది నిరంతర ప్రక్రియ అని గ్యాస్ డీలర్ టి.కృష్ణ మంగళవారం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.500 రాయితీతో ఇచ్చే సిలిండర్‌కు ఈ కేవైసీకి ఎలాంటి సంబంధంలేదని, మూడు నెలల వరకు ప్రతిరోజూ ఈ-కేవైసీ చేస్తారని, వినియోగదారులు ఆందోళన చెందవద్దని ఆయన పేర్కొన్నారు.

గ్యాస్ ఆఫీస్ వద్ద క్యూ కట్టిన వినియోగదారులు

రేపటి నుంచి 6 వరకు గ్రామసభలు

పినపాక, డిసెంబర్ 26: ప్రభుత్వ ఆదేశానుసారం ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వీరభద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామసభల్లో ఆరు గ్యారంటీలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ గ్రామసభలకు తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవోలు బాధ్యత వహిస్తారని, ప్రజలు గ్రామసభల్లో పాల్గొని వారి సలహాలు, సూచనలు అందించాలని పేర్కొన్నారు.

వృద్ధులు, వితంతవులకు దుప్పట్లు పంపిణీ

అశ్వారావుపేట రూరల్‌లో దుప్పట్ల పంపిణీ

పాల్వంచ రూరల్: దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 26: మండలలోని అనంతారం గ్రామ చర్చిలో వృద్ధులు, వితంతవులు 30 మందికి దుప్పట్లను మంగళవారం బీఆర్ఎస్ నాయకులు బరగడ కృష్ణ, కాంతమ్మ పంపిణీ చేశారు. పాస్టర్ రాజు పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్‌లో..

పాల్వంచ రూరల్, డిసెంబర్ 26: మండలంలోని బండ్రి గొండ పంచాయతీ కోయగట్టు, సీతారాంపురంలోని వంద మంది పేదలకు పాల్వంచకు చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్ అధ్యక్షుడు చేపూరి బ్రహ్మం మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. బాధ్యులు ఆరుద్ర సత్యనారాయణ, మాడిశెట్టి రాజమనోహర్, కాటా నవీన్, పుట్టా నాగేశ్వరావు, పాకాలపాటి రోశయ్య చౌదరి, పోట్రు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షికోత్సవం

తల్లాడ, డిసెంబర్ 26: పట్టణంలోని కొత్తగూడెంరోడ్డులో గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి 16 రోజుల పండుగ సందర్భంగా మంగళవారం స్వామి వార్లకు అర్చకులు పంచామృత అభిషేకం, కుంభాభిషేకం, రుద్రహోమం, లక్ష్మీగణపతిహోం నిర్వహించారు. అనంతరం సర్పసూక్తంతో హోమం, నవగ్రహ హోమం జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యాస నాగేంద్రప్రసాద్, భాస్కరాచారి, పున్నం శ్రీనివాసరావు, కొమ్మినేని వెంకటేశ్వర్లు, కొమ్మినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానసరస్వతీదేవి విగ్రహ ఆవిష్కరణ

సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 26: వాసవీక్లబ్ సత్తుపల్లి గ్రేటర్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జ్ఞానసరస్వతిదేవి విగ్రహాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాసవీక్లబ్ చేస్తున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమని, జ్ఞానసరస్వతి విగ్రహాన్ని పాలిశెట్టి శివకుమార్ అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ సత్తుపల్లి గ్రేటర్ సభ్యులు పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై ఉపాధ్యాయుని వినూత్న ప్రచారం

టీషర్టును ఆవిష్కరించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, డిసెంబర్ 26: పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కంభంపాటి వెంకటేశ్ గుండెపోటు సమస్యకు సంబంధించి వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గుండెపోటుకు ప్రథమచికిత్సగా సీపీఆర్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రచార టీషర్టును ఎమ్మెల్యే మట్టా రాగమయి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం చక్రపాణి, ఉపాధ్యాయులు నర్సింహారావు, కంకటి వెంకటేశ్వరరావు, కుమారి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

తిరుమలాయపాలెం, డిసెంబర్ 26: ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తిరుమలాయపాలెంలో మంగళవారం జరిగిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రమైన తిరుమలాయపాలెం బస్టాండ్ సెంటర్లో షాపింగ్ కాంప్లెక్స్, పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు కొలిచలం స్వామి, వెంకటేశ్, వెంకన్న, నాగేశ్వరావు, ఉప్పలయ్య, రాములు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి వినతి

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న గుమ్మడి

కారేపల్లి, డిసెంబర్ 26 : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పలు సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఖమ్మం పట్టణంలోని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా కార్యాలయంలో మంత్రిని కలిసి సింగరేణి మండల పరిధిలోని కోటిలింగాల బుగ్గవాగు బ్రిడ్జీ, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఆయన వెంట నాయకులు గుగులోత్ తేజానాయక్, ఎన్.వీ.రాకేశ్, తాటి పాపారావు, రావుల నాగేశ్వరరావు, పులికాలి సత్తిరెడ్డి తదితరులు ఉన్నారు.

మల్లు నందిని పరామర్శ

వైరాటౌన్, డిసెంబర్ 26 : వైరాకు చెందిన మల్లు వెంకటేశ్వరరావును ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందిని మంగళవారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట నాయకులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

వైరాటౌన్, డిసెంబర్ 26 : వైరాలోని అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఉన్న మిట్టపల్లి ఫంక్షన్ హాల్‌లో వైరా మండలం, వైరా మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ పాల్గొంటారని బాధ్యులంతా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నేడు జమలాపురం ఆలయ హుండీ లెక్కింపు

ఎర్రుపాలెం, డిసెంబర్ 26: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు ఆలయ హుండీ లెక్కిస్తామని ఆలయ ఈవో జగన్మోహన్‌రావు మంగళవారం తెలిపారు.

మెట్టాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

సత్తుపల్లి రూరల్, డిసెంబర్ 26: పట్టణంలోని మెట్టాఅంజనేయస్వామి ఆలయంలో ఇడుపులపాటి వెంకట శివప్రసాద్, అనసూయ దంపతులు మంగళవారం అన్నదానం నిర్వహించారు. తొలుత వారు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి శివాలయంలో చండీహోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 26: మండల కేంద్రంలోని శ్రీబ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున స్వామి దేవాలయంలో చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి పర్వదినం సందర్భంగా శివాలయంలో శ్రీస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. అర్చకుడు సత్యనారాయణ శర్మ వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా చండీహోమం జరిపించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

అశ్వారావుపేట, డిసెంబర్ 26: స్థానిక అమ్మా సేవా సదనంలో వృద్ధులకు మంగళవారం లయన్స్‌క్లబ్ బాధ్యులు దప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జీఎస్టీ కో ఆర్డినేటర్ జెల్లా దశరథ మాట్లాడుతూ.. ప్రజలకు సామాజిక సేవ అందించడమే లయన్స్ క్లబ్ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. క్లబ్ బాధ్యులు దూబకుంట్ల దుర్గారావు, జూపల్లి బ్రహ్మారావు, చల్లా రామారావు, పుట్టా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

అశ్వారావుపేట, డిసెంబర్ 26: ఒక వివాహిత అదృశ్యం కావడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కోయ రంగాపురానికి చెందిన భాగ్యలక్ష్మికి అదే గ్రామానికి చెందిన మంగరాజుతో మూడు నెలల క్రితం వివాహమైంది. కొంతకాలంగా కుటుంబంలో కలహాలు నెలకొన్నాయి. సోమవారం భర్తతో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో మనస్తాపం చెందిన భాగ్యలక్ష్మి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై తండ్రి మల్లయ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

మహిళా న్యాయవాది మృతిపై కేసు నమోదు

రఘునాథపాలెం, డిసెంబర్ 26: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ మహిళా లాయర్ పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. దీనిపై మృతురాలి తల్లి సార్లమ్మ ఫిర్యాదు మేరకు ఖానాపురం హవేలీ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీహరి కథనం ప్రకారం.. ఖమ్మం నగరం గొల్లగూడెం రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న కే.స్వప్న (35) ఖమ్మంలో జూనియర్ లాయర్‌గా పనిచేస్తున్నది. కాగా, గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. జీవితంపై విరక్తితో ఈ నెల 23న తాను ఉండే అపార్ట్‌మెంట్‌లో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కాగా, కుటుంబ సభ్యులు గుర్తించి ఆమెను ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది.

ఐలూ జాతీయ మహాసభల బ్యానర్ ఆవిష్కరణ

నినాదాలు చేస్తున్న ఐలూ నాయకులు

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 26: ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు హౌరాలో జరిగే ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలూ) 14వ మహాసభల ప్రచార బ్యానర్‌ను నాయకులు మంగళవారం కొత్తగూడెం కోర్టులో ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, సభ్యులు పురుషోత్తంరావు, రావిలాల రామారావు, అన్నపూర్ణ, అరికెల రవికుమార్, ఉప్ప అరుణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 26: వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు మంగళవారం అమ్మ సేవాసదనంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కొట్టె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి ఎస్సైగా రాజమౌళి

ములకలపల్లి, డిసెంబర్ 26: ఎస్సైగా ఎం.రాజమౌళి మంగళవారం విధుల్లో చేరారు. ఇక్కడి ఎస్సై సాయి కిషోర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో లక్ష్మీదేవిపల్లి ఎస్సై రాజమౌళి వచ్చారు. ఈయన గతంలో గ్రేహౌండ్స్‌లో పనిచేశారు.

భద్రాచలం జడ్జికి టీటీడీ డైరీ, క్యాలెండర్ అందజేత

దుమ్ముగూడెం, డిసెంబర్ 26 : లక్ష్మీనగరం గ్రామానికి చెందిన టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్య పిలకా నాగేందర్‌రెడ్డి భద్రాచలం కోర్టు ప్రథమశ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్వర్లుకు టీటీడీ దైనందిన డైరీ, క్యాలెండర్‌ను మంగళవారంఅందజేశారు. ఆయన వెంట మాజీ ఏజీపీ, సీనియర్ న్యాయవాది పడిసిరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

టీటీడీ డైరీ, క్యాలెండర్ అందిస్తున్న పిలకా నాగేందర్‌రెడ్డి

నమస్తే తెలంగాణ మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616